



పరమేశాన్కి-పల్లెటూరి పంచాయితీ సమితి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ పదవి లభించటంతో ఎక్కడలేని సంతోషమైంది.

అతడు పుట్టిందీ, పెరిగిందీ, టవున్‌లో. పల్లెపట్టులలో, ప్రశాంత వాతావరణంలో పైరుగాలి పీల్చుకుంటూ అమాయక రైతుల మధ్య వారి పిల్లలకి చదువు నేర్పుతూ గడపాలని మహా వుబలాటంగా వుండే దతడికి.

కాలం గడిచే కొద్దీ టవున్ మీద విసుగెత్తి పల్లెటూరి వైపు మనసు పోసాగింది. దాంతో ఎప్పుడెప్పుడు పల్లెటూళ్ళో ఉద్యోగం చేసేనా! అంటూ ఆత్రపడ సాగేడు పరమేశం.

ఆ రోజు రానే వచ్చింది. ఆర్డరు తీసుకున్నాడు. పెట్టె, బెడ్డుతో సాయంత్రం బస్సుకే ఎక్కాడు. వూరూపాడూలేని ఓ నిర్జన ప్రదేశంలో బస్సు వాపి "దిగండి" అన్నాడు కండక్టరు పరమేశంతో.

పల్లెటూరి గురించి తీయటి వూహల్లో వున్న పరమేశం ఉలిక్కిపడి యీ లోకంలోకి వచ్చిపడ్డాడు బస్సు దిగాడు సామానుతో. అది వెళ్ళిపోయింది. తారు రోడ్డుకు ఎడం వేపుతో బళ్ల రస్తా వుంది. ఆ దారంట 6 మైళ్ళు నడిస్తే ఆ వూరొస్తుంది అని కండక్టరు చెప్పాడు.

పరమేశం కాస్సేపు తనతీయటి వూహలకి ఫుల్ స్టాప్ పెట్టి వాటి స్థానంలో దిగులును ప్రవేశపెట్టాడు. ఇక్కణ్ణుంచి ఆ పల్లెకు యీ మోతతో చేరట మెలారా భగవంతుడా అని!

అలా ఓ అరగంట బిక్కుబిక్కు మనుకుంటూ గడిచాక ఓ నలభై ఏళ్ళ మనిషి ఇద్దరు 16 ఏళ్ళ కుర్రాళ్ళతో ఆవేపుగా వచ్చాడు. ఆ మనిషి అడిగాడు "ఎక్కడికి పోవాలయ్యా?" అని.

చెప్పాడు పరమేశం.

"ఎందుకూ ఆ వూరికి?"

"నన్ను టీచరుగా వేశారక్కడ."

"ఏం ఇప్పుడున్నాయన బాగా లేకనా నిన్నేసింది?"

పల్లెటూరి జనం అంటే వినయం, విధేయతా కలవారనీ, చదువుకున్న వాళ్ళంటే చాలా గౌరవిస్తారనీ, ఓ అభిప్రాయ ముండేది పరమేశానికి. కానీ యీ మనిషి మాటల్లో అలాటిదేమీ కనపట్టం లేదు. అయినా మనకిప్పుడు టైం బాగాలేనట్లుంది అనుకున్న పరమేశం మరేం మాట్లాడలేదు.

వాళ్ళు వెళ్ళిపోసాగేరు.

"ఈ పెట్టె పరుపూ కాస్త మనూరికి చేర్చండి" అంటూ రిక్వెస్టు చేసుకున్నాడు పరమేశం.

దీనికా కుర్రాళ్ళిద్దరూ నవ్వసాగేరు. వాళ్ళ నవ్వుకి అర్థం బోధపళ్లేదు పరమేశానికి.

"మూడు రూపాయలిస్తే మోసుకొస్తాం" అన్నారు కాస్సేపటికి నవ్వాపుకుని.

"ఈ కాస్తకు మూడు రూపాయలేంటి?" పల్లెటూరి వాళ్ళు కాయకష్టానికి ఎన్నడూ వెనుకాడరు. రెక్కల కష్టం చేయటానికి వాళ్ళు డబ్బు పుచ్చుకోరు అన్నది పల్లెవాసుల గురించి అతడు ఏర్పరచుకున్న అభిప్రాయాల్లో ఒకటి.

"మీటవున్న బస్సు మీది నుంచి కింద బెడితే నెత్తిన గొట్టి అర్ధరూపాయ తీస్కుంటారు. మా పల్లెటూరోండ్లను చూస్తేనే మీరీ రకంగా మాట్లాడేది" పెద్దమనిషి అసహ్యంగా అన్నాడు.

గత్యంతరంలేదు. సరే అన్నాడు పరమేశం.

ఊళ్లో ప్రవేశించి నేరుగా ప్రెసిడెంటు ఇంటికి వెళ్ళాడు. ఆయన ఊళ్లో లేడు తమ్ముడున్నాడు. పరమేశం పలానా అని తెల్పుకుని "ఈ బి. డి. ఓ. కేం పనిలేకపోతే సరి. బాగా నదువుజెప్పే వాండ్లని ఒక్కచోట వుంచరు. ఎవర్నో దెచ్చి మా మీద దొబ్బుతారు" అంటూ విపరీతమైన చీకాకు కనబరచి మళ్ళా కాస్సేపటికి "టీచరింటి కాడికే పోండి. మాయన్న పొద్దునొస్తాడు" అంటూ తను చదువుతోన్న అపరాధపరిశోధక నవల "మెత్తని కత్తి"లో లీనమైపోయాడు.

పల్లెటూరి గురించి తనూహించుకున్న దానికి బొత్తిగా విరుద్ధంగా వుంది. గాభరాపడ్డాడు పరమేశం. కనీసం కూచోమని కూడా చెప్పటానికి తెలియని మూర్ఖులుంటారని అతడనుకోలేదు. ఎంత ధనముంటే మాత్రం ఇంటి కొచ్చిన ఉద్యోగికి ఆమాత్రం మర్యాద యివ్వకర్లా? స్కూలు మాస్టారంటే ఎంతో గౌరవిస్తారనుకొన్న ఆశ అడియాశైపోయింది.

ఉసూరుమంటూ టీచరు బస కొచ్చాడు పరమేశం. దాన్ని చూచేసరికి జ్వర మొచ్చినంత పనైందతనికి. అది ఓ పాడుబడ్డ సత్రం. మూడు సగం పడిపోయిన గదులు. ఒకటి మాత్రం కాస్త నిలబడి వుంది. దానికి కిటికీలకు తలుపులుకానీ, కడ్డీలు కానీ లేవు. అదీ వూరి బయట వుంది.

తడబడుతూ లోని కడుగు పెట్టాడు పరమేశం. వెంట వచ్చినవాడు వెళ్ళిపొయ్యాడు. అప్పుడు టైం ఎనిమిదయ్యుంటుంది. టీచరుగారు వంట ప్రయత్నంలో ఉన్నట్లుంది.

పరమేశం ఆయనకు తన్ను పరిచయం చేసుకున్నాడు. "అరెరె! రండి, రండి! అలా చాప వేసుక్కూచోండి" అంటూ సంతోషంగా ఆహ్వానించాడు టీచరు.

ప్రవేటు చెప్పడా? నీంబిట్లా మాట్లాడ్తావ్?" అన్నాడు మునసబు.

"అయ్యో దానికేముందండీ! ఎందుకు చెప్పనూ? బడి విడుస్తూనే నాకంత కన్నా పనేముంది గనకా" అన్నాడు పరమేశం.

ఆ ఒక్క మాటతోటే ఆడవాళ్ళ మొహాలు చేటెడయ్యాయి. మళ్ళా ఓసారి వడ్డించారు వద్దంటున్నా వినకుండా.

ఎన్నివిధాల లొంగ దీస్తున్నారురా భగవంతుడా! వీళ్ళ ఎత్తుల్నుంచి తప్పించుకోటం ఎలా? అనుకోపోగాడు పరమేశం.

ఆరోజా సాయంత్రానికి తన సామానుతోసహా వెళ్ళిపొయ్యాడు పాత టీచరు.

ఆయన వెళ్లిపోతోంటే ఎన్నో ఏళ్ల ప్రాణ స్నేహితుడు వెళ్లిపోతున్నంత దుఃఖం కల్గింది పరమేశానికి. ఇంత కుళ్ళు, కుతంత్రంగల కొంపలో ఆ మహానుభావుడు ఏకబిగిని మూడేళ్లు ఎలా నెట్టుకొచ్చాడో! ఎంత మెత్తని మనసు కలవాడు పాపం! ఈ వూరును చూచినప్పట్నుంచీ లావాలా కుతకుత వుడికిపోతున్న తన మనసుపై ఆయన మాటలూ, ఉపదేశాలూ పన్నీటి జల్లులై ఎంతటి రిలీఫ్ నిచ్చాయి!

అధైర్యంతో అడుగంటిపోయిన ఆశతో తను ఇక్కడ ఉద్యోగం చెయ్యగలనా అని భయపడిపోయి బాధపడుతోంటే ఆయనన్నాడు "నీవింకా చిన్న వాడివి. నల్లనివి నీళ్ళనీ, తెల్లనివి పాలనీ మాత్రమే అనుకొంటూవు. నల్లనివి నీళ్లు కాదనీ, తెల్లనివి పాలు కాక సున్నపు తేట అని గ్రహించిన రోజున క్రుంగిపోతావు అది పురుష లక్షణం కాదు. అందుకే మనస్సును అధీనంలో వుంచుకోవాలి. మనిషిని చూచి మనిషి భయపడాల్సింది లేదు ధనం అధికారం చూచి అంతకంటె భీతి చెందకూడదు. ఎవరి కెంత మర్యాద ఇవ్వాలో అంత తప్పకుండా యివ్వాలి. మన హితం కోరేవాండ్లకు తప్పక భయపడాలి. నీలో తప్పుల్లేకుంటే ఎవరి మాటగా పడవల్సిన పనిలేదు ధైర్యంగా నిల్చి పోట్లాడే శక్తి వుంటే పోట్లాడు. లేనిపక్షంలో ఎదుటివాణ్ణి వుబ్బించు. కాకాపట్టు. ఎవడినైతే నీవు పలుకరిస్తావో వాడికే నీవు అంత ప్రత్యేక మర్యాద చేస్తున్నట్టు నటించు. దాంతో వాడు నీకు చేసే సహాయాలు ఎన్నో వుంటాయ్. రోజూ వాడింటి నుంచి కాఫీ మొదలుకొని కూరా నారా వరకూ నీ ఇంటి కొచ్చి పడతాయి. నీతో మాట్లాడందే వాడికి గడవదు. నన్ను నీ యెదుట మెచ్చుకున్నా రందరూ. పొయ్యేవాణ్ణి మెచ్చుకోటం మామూలే. నాలో లేని గొప్పలు చెప్పారు వాళ్ళు. నీవు ఇంకా శ్రద్ధగా పని చేయాలని వాళ్ళ మాటల సారాంశం." అంటూ హితోక్తులూ, ధైర్యోక్తులూ చెప్పేటప్పటికి పోయిన ప్రాణం లేచి వచ్చినట్లయింది. పోయిన ఆశల్ని కూడదీసుకున్నాడు. హాయిగా గాలి పీల్చుకున్నాడు.

ఆ క్షణంలో గీతామృతాన్ని బోధించిన కృష్ణ పరమాత్మలా కనిపించా డాయన పరమేశానికి. సజల నయనాలతో ఆయన్ను బస్సెక్కించాడు.

"పిచ్చివాడా ఏం భయపడకు. ఇంకా పెళ్ళి, పిల్లలూఏంలేని వాడివి. నీకేం దిగులయ్యా మాలాంటి వాళ్ళమే ధైర్యంతో వుండగా. మరేం ఫర్వాలేదు. కర్తవ్యపాలనలో ఏమాత్రం అశ్రద్ధ చూపొద్దు. పిల్లల్ని బాగా చూచుకో." మని భుజం తట్టి మరో సారి ధైర్యం చెప్పాడాయన.

ఒంటరిగా బండిలో వూరికి తిరిగి వచ్చేశాడు పరమేశం.

సత్రం ఖాళీగా పాడుబడ్డ స్మశానంలా అవుపించింది.


"దీపం కూడా లేదు. రాత్రికి, ఎలాగో" అనుకుంటూ వుండగా ప్రెసిడెంటుగారి అమ్మాయిలిద్దరూ వచ్చారు పాలేర్ని తీసుకొని. బహుశా ట్యూషనుకు కాబోలు. పాలేరు చేతిలో లాంతరుంది.

పరమేశం సంతోషంగా పిల్చాడు పిల్లల్నిద్దర్నీ. ఈ ఒంటరి సత్రంలో శూన్యమైన మనస్సుతో, పరిపరి విధాల పోతున్న తన ఆలోచనల్ని అరికట్టాలంటే యీ ముగ్ధ బాలికలకు ఏదో చెప్పటం చాలా మంచిది. వాళ్ళు ఇప్పుడు కేవలం తన ఒంటరితనాన్ని పోగొట్టటానికి వచ్చిన స్నేహితుల్లా కనిపించారతడికి. వాళ్ళ రాక అతడి కత్యంత ఆనందకరమైంది. ఆ చిన్న లాంతరే అప్పుడతడికి కాంతివంతమైన అరుణ కిరణంలా కనిపించింది.

"కూర్చోండి" అంటూ వాళ్ళ పుస్తకాలు తీసుకొని అన్నీ పరిశీలించి ఓ గంటసేపు పాఠం చెప్పాడు. ఆ గంటా వేరే ధ్యాస లేదతడికి. అతడు పాఠం చెప్పే విధానానికి పసిపిల్లలిద్దరూ నాగస్వరం విన్న నాగులే అయ్యారు. ఆ ఒక్కరోజులోనే వాళ్ళ చిన్నారి హృదయాల్లో కొత్త టీచరుకో గౌరవస్థానం ఏర్పడిపోయింది.

ప్రెసిడెంటుగారి ఇంటి నుంచే క్యారియర్ వచ్చింది. పిల్లలిద్దరూ నమస్తే చెప్పి వెళ్ళిపోయారు.

భోజనం క్యారియర్‌ను చూసిన పరమేశం "ఫరవాలేదు తనోరకంగా ఉపాయంగా వుంటే యీ వూళ్లో బాగానే గడుస్తుంది" అనుకున్నాడు. దానికితోడు పాతటీచరు చెప్పిన హితోక్తులు "ఎదుటి వాణ్ణి నీ మాటలతో వుబ్బించు. దాంతో వాడు నీకు చేసే సహాయాలు అనంతం" అన్న మాటలు జ్ఞప్తి కొచ్చి ఫక్కున నవ్వుకున్నాడు. ఒకవిధమైన హుషారు కలిగింది. చింతా, గింతా వదిలేసి సుష్టుగా భోంచేశాడు.



ఆరోగ్య అనారోగ్య
పరిస్థితులలో మహిళలు
ఆరోగ్య సౌభాగ్యములకు ఆధారపడునది
లోధ్ర
66 సంవత్సరముల పైగా ప్రసిద్ధినొందినది

కేసరి కుటీరం
(ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14
ఏజెంట్లు
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ - సికింద్రాబాదు - మధుర - బరహంపురం - బెంగుళూరు

నేషనల్ ట్రాన్సిస్టర్
జపానుచే కనుగొనబడిన జేబు రేడియో. అన్ని ట్రాన్సిస్టర్లు, లౌడ్ స్పీకర్లు గ్యారంటీ. జపాను తయారీ.

స్టేషన్లు ప్రసారము ఎక్కడవున్నా సంగీతం, వార్తలు వగైరా వినవచ్చు. ప్రపంచమందలి ప్రతి స్టేషన్నానికంగా వినబడునటు గ్యారంటీ. వినటానికి సిద్ధంగ పంపబడును. టార్చి సెల్స్‌తో పనిచేయును అనువైనది, అందమైనది. 3 సం॥ గ్యారంటీ. డీలక్స్ నెం. TR 44 ధరరు. 72/- వి. పి. పి. ఛార్జీలు రు. 6/- రేడియో లెదర్ కేసు రు. 7/-50
INDUSCO (WAP-72)
Beat No. 13, Aligarh.

శుభవార్త

మొండి వ్యాధులకు, కడుపునొప్పి, తలనొప్పి, స్త్రీవ్యాధులు, పండ్ల వ్యాధులకు ప్రత్యేక చికిత్స. నాడీ పరీక్షతో వ్యాధిని ఎన్నుతురు. ప్రతినెల జిల్లా ముఖ్య కేంద్రాలలో మానాడి ప్రతినిధులతో సలహాలు మీ జిల్లా తేది కొరకు వ్రాయండి.
రామూస్ ప్రోడక్ట్సు,
ఖైరతాబాద్ హైదరాబాద్-4 (H.O.)
—SWASTIK

## పల్లెటూళ్లో బడిపంతులు

మర్నాడు ఆదివారం బడి లేదు. ఆరోజు ఉదయాన్నే పూరికి వెళ్ళి వంటపాత్రలు, స్టౌ, మొదలైనవి పట్టుకొచ్చాడు సాయంత్రం బస్సుకే.

అతడు పూరికి పోతాడు అని తెల్సి ప్రెసిడెంటుగారు వచ్చేటప్పుడు బ్యాటరీ సెల్సు తెమ్మనీ, మునసబుగారు కాఫీపొడి తెమ్మనీ, ఆయన భార్యగారు ఏవో ప్లాస్టిక్ దారాలు తెమ్మనీ ఫర్మానాలు పంపేరు.

ఇవి తను డబ్బు పెట్టి తెస్తే తిరిగి వస్తుందా రాదా? అని ఆలోచించాడు పరమేశం.

"ఏది ఏమైనా కానీ, ముందు తేవడమే మంచిది ఎలాగో మంచిగా వసూలు చేసుకోవాలి తర్వాత. అంతగా ఇవ్వకపోయినా ఫరవాలేదు వాళ్ళు రోజూ రెండు పూటలా ఎవరో ఒకరు కాఫీ ఇస్తున్నారు. పప్పు, చారు, పచ్చడి లాంటివి తను అసలు వండటమే లేదు. ఇవన్నీ పూరికే వస్తాయా? ఈ విధంగానైనా ఆ ఋణం తీర్చుకున్నట్లవుతుంది" అనుకుని తెచ్చాడు పరమేశం.

తను సత్రం వాకిలి తెరుస్తోండగానే వచ్చాడు ప్రెసిడెంటుగారి మనిషి బ్యాటరీ సెల్సు కోసం. వాడక్కడ వుండగానే మునసబుగారు వచ్చారు కాఫీపొడి కోసం. మునసబుగారిక్కి కాఫీపొడి చేతిలో పెట్టి "కాఫీపొడి ధర చాలా పెరిగిపోయిందండీ, యీమధ్య, మూడు రూపాయలకు పౌనుండేది మూడున్నరైంది" అన్నాడు.

ప్రెసిడెంటుగారి పాలేరు అక్కడే వున్నందున వెంటనే మూడున్నరా, రంగు దారాల డబ్బూ యిచ్చి వేశాడు మున్సబు.

మళ్ళా వాడు వినాలి అనేట్లుగా "అదేమిటయ్యేయ్, సెల్సులు గూడా తెచ్చినట్లున్నావే. ఎంత ఇవి? డబ్బిచ్చారా? ఇంతకూ ఎవరిక్కి?" అంటూ అడిగాడు.

"ప్రెసిడెంటుగారి కండీ, రెండు రూపాయలు. డబ్బులు ముట్టాయిలెండి" అంటూ ఓ చిన్న అబద్ధం ఆడాడు.

మునసబు వెళ్ళిపోయ్యాడు. ప్రెసిడెంటుగారి, పాలేరు వెళ్ళిపోయి ఐదు నిముషాల్లో తిరిగొచ్చి రెండురూపాయలు చేతిలోపెట్టి "అయ్యగారు నిన్ను శానా మెచ్చుకున్నారు సారో" అన్నాడు.

పరమేశం చిన్నగా నవ్వుతున్నాడు.

కొద్దిరోజుల్లో ఇట్లా వుపాయంగా నెట్టుకుంటూ రావటంలో కాస్త అనుభవం సంపాదించాడు పరమేశం. మొత్తానికి రోజులు సుఖంగానే వెళ్ళిపోతూన్నాయి.

ఓ రోజు స్కూల్లో హాజరు వెయ్యటం పూర్తిచేసి పాఠం మొదలెట్టాడు ఇంతలోనే ఎవరో వచ్చి "మావోడు కాపి తాగొస్తాడు పంపియ్యి సారూ" అన్నాడు.

"స్కూలు టైంలో ఏమిటయ్యా కాఫీ వెళ్ళు. టైమయిందిలే వస్తాడు"

"యాఁ పంపియ్యి సారూ! మామంత తాగి అణ్ణె డిస్తే ఎట్లా సారూ పిల్లోడు. దారా, కాపి తాగొత్తుదా" అంటూ విడవకుండా పట్టుపట్టాడామనిషి.

"ఈ పల్లెల్లో కూడా కాఫీ ఎంతగా అలవాటైపోయిందిరా" అంటూ నిట్టూర్చి "వెళ్ళిరా ఎ ఒరా వెళ్ళు. పాఠం నీవు కాఫీ తాగలేదనివిపోనాన్న బెదిగొట్టుకున్నాడు" అంటూ వాణ్ణి పంపేశాడు పరమేశం.

మళ్ళా పాఠం మొదలెట్టి చెబుతోండగా నలుగురు పిల్లలు ఓ పిల్లవాణ్ణి చేతులూ, కాళ్ళూ పట్టుకుని ఎత్తుకొచ్చారు బడిలోకి. వాడికి 16 ఏళ్ళుంటాయి. ముతక అంగీ, నిక్కరూ చెమట గబ్బు కొడుతున్నాయి. బోడిగుండు. భుజానికి చద్దిమూటా, చేలు కోసి వున్నాయి.

పరమేశం అడిగాడు "ఏమిట్రా తిమ్మన్నా! ఏమిటీ వేషం? బడికి రాకుండా ఎక్కడికి పోతున్నావ్?"

"పనులు తొక్కపోతుంటే మామంత పోయి కాళ్ళు సేతులు పట్టుకొని మోసుకొచ్చిండాం సార్. మమ్మల్ని గిచ్చిండు సార్ కాట్లు బడేటట్లు" అంటూ నలుగురూ ఫిర్యాదు చేశారు.

"లేదు సార్! బడి కొస్తుంటి సార్ బుక్కులు దీస్కుని. దావలో రొడ్డిగారింటి కాడ రొడ్డి పెళ్ళి 'యిలే తిమ్మిగా! నవారిగాడు యీయాల పసుల గాయనికి రాలా. నువ్వు తోలుకపోదురా' అంటే తోలుకపోండా సార్."

"నేను బడికి వెళ్ళాలి అని చెప్పలేకపొయ్యావ్?"

"చెప్పితి సార్! 'నయ్యాల బడికి పోతాడంట బడికి. ఎందు కశా నీకు సదువు. ఆ బుక్కులాడ బెట్టి సద్ది దీస్కునిపో పసులెంట. రోసట్లుంటే పోదువు బడికి' అంటని తిట్టిండు సార్."

"అలాగా అయితే వెళ్ళు పశువులు చాలా దూరం వెళ్ళి వుంటాయ్" అంటూ వాడిని పంపేసి గాఢంగా నిట్టూర్చాడు పరమేశం. దీనికి విరుగుడు చెయ్యాలి. విద్య యొక్క ప్రయోజనాలు అందరికీ తెలుపటం టీచరునైన నా విధి. ముందు విద్య అంటే ఏమిటో తల్లిదండ్రులు తెల్సుకున్నపుడే తమ పిల్లలకి అది వచ్చేట్లు శ్రద్ధ చూపగలరు. ముందు వాళ్ళని పట్టి చూడాలి." అని నిర్ణయించుకున్నాడు పరమేశం.

ఆరోజు సత్రంలో ఒంటరిగా వున్నాడు. రామయ్యనే ఓ రైతు వచ్చాడు. అతడు అప్పుడప్పుడు అలా వచ్చి పోతూంటాడు. పరమేశం దగ్గరికి.

"ఏం రామయ్యా బాగున్నావా?"

"ఆ బాగుండాలె సారూ! కాస్త అగ్గిపెట్టెల్లా, సారెయ్యి" అని యిప్పించుకుని బీడీ వెలిగించుకున్నాడు.

"మీ అబ్బాయిని విద్య సరిగా బడికి పంపవు ఎంచేత?"

"అదొక్కటె తక్కువైంది నాకు. యాలకింత కూటి గావాల్సిన గింజలు తెచ్చుకోడాన్కే కష్టపడుతోంటే ఇంగ సదువెక్కడ సెప్పిస్తుం?"

"ఇక్కడ చదువు కేమీ ఖర్చులేదే?"

"ఈ పూరి సదువుకే నౌక రొస్తదా? మళ్ళా ఎస్సెల్సి వరకూ సదవాల. అప్పుడు గదా!"

"అయితే ఇక్కడ చదివిన చదువు వల్ల లాభమే లేదంటావ్?"

"గుడ్డి గవ్వ లాభం లేదంటాను."

"జాబులు చదువుకో వచ్చు, రాయచ్చు గదా?"

"మా యట్లాంటి యదవలకి యాజావ్వూ రాదు"

"నిన్ను నీవే వెధవ అనుకుంటున్నావ్. అది తప్పు నీ బతుకు నీవు ఉన్న బతుకుతున్నావు కదా!"

"అయినా మామాటే లోకువ అందర్కీ."

"ఎందుకంటావ్?"

"మేం మోటు ముండాకొడుకులమని."

"మీరు మోటువాళ్లెట్లా అయ్యారు?"

ఈ సంభాషణ జరుగుతోండగా ఇంకో నలుగురు రైతులు అప్పుడే వచ్చి నిశ్శబ్దంగా పరమేశం చెప్పేది ఆలకించసాగేరు.

"ఆ రెండచ్చరాలు రానందుకు మాము మోటోళ్లమైనాం."

"అలా చెప్పు బాగుంది. నీకెలాగూ చదువు రాలేదు. నీ కొడుకునైనా ఎందుకు చదువుకో నియ్యవు. రేప్పొద్దున అదృష్టం బాగుండి వాడు బాగా చదివి ఓ పెద్ద వుద్యోగం చేయొచ్చు. ఎవరు చూడొచ్చారు? మన కేంద్రమంత్రి సంజీవయ్యగారు, మీ వూరి లాంటి అతిసామాన్య గ్రామంలో పేదల ఇంట్లో పుట్టి కష్టపడి బాగా చదువుకోవడంవల్ల దేశానికే ఏలిక అయ్యాడా లేదా చెప్పు?"

"అవును సారూ, అయ్యాడు. ఎవర్కో అసుంటి అదృష్టం పట్టేది."

"ధూ పూర్కోరెశా, సారు చెప్పేది పూర్తిగా యినను. చెప్పు సారూ నువ్వు" అన్నారు మిగిలిన నలుగురూ.

"మీకేదైనా జాబులొస్తే పని వదులుకొని చదువు వచ్చిన వాడిని వెతుక్కుంటూ పోవాలి. అలాగే జాబు రాయించుకొనేటపుడూ వెతుక్కోవాలి. ఇందువల్ల ఆ రాసిన వాడికి నీ రహస్యాలన్నీ తెలుస్తాయి. తర్వాత మీరంతా పన్ను కడుతుంటారు కదా?"

"ఏంది ఒక్క పన్నుగాదు. భూంపన్ను, నీళ్ల పన్ను, బెటర్మెంటు పన్ను ఇట్లా ఏందేందో పెద్దిన్ని పన్నులుతీసి మమ్ముల్ని సంపేస్తుండారు." అని ఒక రనగానే ఇంకొక రందుకుని "అవునశా ఏందీంట యిదీ? మొన్న మొన్న మూన్నెల్లు కాలేదే పన్ను కోసరమని నా బర్రెను యాలం వేసి కట్టుకున్నాడు కాదూ్కన. (రెవిన్యూ ఇన్స్పెక్టరు) మళ్ళా యీ పొద్దొచ్చిండు. ఏందిది?" అంటూ వాపోయాడు.

"అలా ఎప్పట్కీ వసూలు చెయ్యరు. మీరు టైముకి సరిగ్గా చెల్లించక ఆలస్యంచేసి వుంటారు. మళ్ళా వెంటనే కట్టాలొచ్చేసరికి మీకు కోప మొచ్చింది. అందుకే చదువొచ్చి వుంటే ఆయనిచ్చిన రశీదుల్లో ఫలానా ఏటికింతా అని వుంటుంది చదువుకో వచ్చు గదా!"

'అది రానందుకే గీ తిప్పలు. అనువంటపుడు మోసం జేసినా మాకు దిక్కేముంది?"

"అట్లా నెక్కడైనా జరిగితే జరగవచ్చునను కోండి. అందుకేనయ్యా మీ పిల్లలైనా చదువుకో నివ్వండి. విద్య ఒకరు దోచుకుపోలేని ధనం. ఒకరి కిస్తే తరగకపోగా ఇంకా పెరుగుతుంది. పదిమందిలో గౌరవాన్ని పెంచి పేరును తెచ్చే పెన్నిధి విద్య. విద్య వుంటే నలుగురిలో తలెత్తుకుని ధైర్యంగా మాట్లాడ గలం. విద్య లేనివాడు వింత పశువు. విద్యలేని మొద్దు కదలలేని యెద్దు ఒకటేనని మీరు వినలేదా? అంచేత కనీసం ఇక్కడ ఉచితంగా లభించే చదువునైనా మీ పిల్లలకి చెప్పించండి. పెద్దయ్యాక వాళ్ళూ మీలాగే అవస్థలు పడకుండా కాస్త అక్షర జ్ఞానం కల్గించండి. మీ పిల్లలకు చదువు నేర్పడాని కోసమే ప్రభుత్వం మాకు జీతాలిచ్చి పెట్టింది. మేం వూరికే జీతాలు తీసుకొంటూ వుంటే చూస్తూ వూరుకుంటారా మీరు? మీరు వూరికే వున్నా నేను అలా వుండలేను. చెప్పండి మీ పిల్లల్ని పంపుతారా లేదా?" పరమేశం ఆవేశంగా మాట్లాడ సాగేడు.

అతడి మాటలకు విస్తుపోయ్యారు అక్కడున్న ఐదుగురూ. ఏమిటింత చిన్నవయసులో పని మీద యితడి కింత శ్రద్ధ అనిపించింది వాళ్ళకి. ఆయన చెప్పిందానికైనా తమ పిల్లల్ని తప్పక పంపాలి బడికి. లేకపోతే ఆయన మనస్సు నొచ్చుకుంటాడు అనే అభిప్రాయాని కొచ్చారు. 'చదువు వల్ల లాభం కూడా వుందని చెప్తాడాయె అందుతోనూ. సరే నష్టమే ముంది. పంపుదాం' అనుకున్నారు. అమాటే చెప్పారు.

ఇప్పుడు బడి పిల్లల్తో కిటకిటలాడిపోతూ వుంది. గ్రామస్తుల కంతా పరమేశం కావల్సిన వాడయ్యాడు. అతడి మంచితనం మల్లెపూల సౌర భంలా అనతికాలంలోనే బహుదూరం వ్యాపించింది

ప్రెసిడెంటుగార్కి, అతడి సలహా తీసుకోంది పంచాయితీ పనులేవీ తోచవు. మునసబుకు అతడితో రోజుకో సారైనా మాట్లాడందే ఏమీ చెయ్య బుద్ధికాదు.

దీనికంతా పరమేశం చాలా కృషి చేశాడు. ఎవరికి తగినట్లు వాళ్ళను పాలిష్ చేశాడు. ఉబ్బించాడు. పొగడ్తలతో ఆకాశానికెత్తెయ్యటం నేర్చుకున్నాడు వాళ్లొస్తారని 2 మంచి పేకు కుర్చీలు తెచ్చి స్వతంతో వేశాడు ఆ నెల ప్రైవేట్ల జీతాలు అందటంతోటే.

వాటిని చూచారు గ్రామపెద్దలు. "మీలాంటి పెద్దలొస్తారని" అంటూ వినయంగా చెప్పాడు. ముగ్ధులయ్యారు పెద్దలు. "పాతయ్యవార్కి యీ మాత్రం మర్యాదే తెల్సేదికాదు. నిలబడే మాట్లాడి పోతుంటిమి" అన్నారు.

ప్రెసిడెంటువచ్చి మాట్లాడుతోంటే మునసబు వచ్చేవాడు. "సారూ!" అంటూ బయట్నుంచే కేకేసే వాడు. పరమేశం "వస్తున్నానండీ" అంటూ ఓ కుర్చీ తీసుకెళ్ళి వరండాలో వేసి అక్కడే అతడితో మాట్లాడేవాడు లోనికి పిలవకుండా.

మునసబును బయటనే కూచో బెట్టినందుకు ప్రెసిడెంటుకు సంతోషం. తను వచ్చేపాటికి లోనుంచి కుర్చీ మోసుకొచ్చి వేసినందుకు మునసబుకు ఆనందం

ఇట్లా ఉపాయంగా వాళ్ళ ఎత్తుల్ని చిత్తు చేసి తన విధి నిర్వహణలో ఏమాత్రం ఏమరకుండా నెట్టు కొస్తున్నాడు పరమేశం.

"పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కోవడంలోనే నిజమైన ఆనందముంది ఉపాయమనేది వుంటే వూళ్లేలొచ్చు" స్వానుభవంతో గ్రహించిన సత్యాన్ని తల్చుకుంటూ చిన్నగా నవ్వుకున్నాడు పల్లెటూరి బడిపంతులు పరమేశం!

